
# అమెరి'కులాసా' కథలు

## – వంగూరి చిట్టెన్ రాజు





# -45-

# రిపేరుకొచ్చిన రిఫ్రిజిరేటరూ-విడాకులిచ్చిన సియర్స్ కంపెనీ

**నాకు** ఈ మధ్య నడక ఎక్కువ అయిపోయింది. నడక అనగానే అదేదో కేలరీలు తగ్గించుకోడానికి బూట్లు వేసుకుని కాలనీలో రోడ్ల మీద రోజూ పది వేల అడుగులు వేసేస్తున్నాను అని ఏ కోశానా అర్థం కాదు. గత మూడు నెలలగా నా నడక అల్లా పొద్దున్న కాఫీకి పాలు కావాలన్నా, కూర వండుకోడానికి వంకాయలు కావాలన్నా, రాత్రి అన్నం లోకి పెరుగు కావాలన్నా ఇంటి వెనకాల ఇరవై అడుగులు దూరంలో ఉన్న గరాజ్ లో ఉన్నప్పటికీ ఇంకా పని చేస్తున్న రెండో మంచు పెట్టే..అనగా రిఫ్రిజిరేటర్ దగ్గరకి వెళ్ళి అవన్నీ తెచ్చుకొడానికి నడిచే నడక అనమాట. దానికి కారణం వంటింట్లో ఉన్న పేద్ద 'బిల్ట్–ఇన్" ఫ్రిజ్ అలిగి పనిచేయుట మానేసింది. అదెలా తెలిసిందీ అంటే ఓ రోజు మా క్వీన్ విక్టోరియా అన్నం పెట్టుకున్న పళ్ళెం ఒక చేత్తో పట్టుకుని, మరో చేత్తో గడ్డ పెరుగు వేసుకుందామని ఫ్రిజ్ లో పెట్టిన సదరు పెరుగు గిన్నె మూత తీయగానే అందులో నీళ్ళ మజ్జిగ కనపడింది. అంతే..'నీ కేమన్నా అది ఉందా? పెరుగు లేకుండా నేనుండలేను అని తెలియదా? దాన్ని ఇలా మజ్జిగ చేస్తే ఎలా తిని చచ్చేది. అదేదో నువ్వే తిని...." అని నాలిక్కరిచేసుకుంది...ఇక్కడ "అది ఉందా" అనగా "బుద్ధి, మతి, కామన్ సెన్స్" వగైరా పదాలు కాబట్టి, స్వయానా కట్టుకున్న వాడిని అంత మాట అనకూడదు అని వాళ్ళ బామ్మ చెప్పిన మాట గుర్తుకొచ్చి. అసలు పెరుగే వేసుకోని నా మీద ఇంత అభాండం నా మీద వేసినందుకు నాకు వినాయక చవితి చంద్రుడూ వగైరాలు గుర్తుకొచ్చినా అప్పటి సమయం, సందర్భాన్ని బట్టి ఆ దహీ రైతా లా రూపాంతరం చెందడం మీద పరిశోధన మొదలుపెట్టాను. అది గడ్డ పెరుగు కానే కాదు ...కీమత్ గ్రోసరీలు అనబడే గుజరాతీ కొట్లో కొన్న దహీ అనియూ, ఏదో 'మానసిక ఫీలింగ్' కోసమే మా ఆవిడ దాన్ని పెరుగు అని అంటున్నదీ అని నేను ముందుగా గమనించిన విషయం.

మరొక గమనిక అంటే ఏమిటీ అంటే ..అదే గుజరాతీ కొట్టులో నేను ఆ ముందు రోజే కొన్న నవ నవ లాడే నాలుగు వంకాయలు నా మొహం లా నీరసంగా వాడిపోయి దాని కేసి..అంటే నా మొహం కేసి దీనంగా చూస్తున్నాయి. ఇక వెన్న కణికెలు పెట్టుకునే చిన్న అర అంతా జిగురు జిగురుగా కారుతున్న ద్రావకంతో వెల వెల బోవుచున్నది. ఇక్క


వెన్న అనగా అది కూడా నా 'మానసిక ఫీలింగ్' కోసం వాడిన మాటే కానీ నిజానికి అది క్రోగర్ అనబడే అమెరికా వాడి గ్రోసరీ కొట్లో కొన్న బ్రెడ్ మీద దొరలు రాసుకునే బటర్ కడ్డీలు అని గ్రహించవలెను.

ఇలా ఆ వంటింట్లో ఉన్న ఘనత వహించిన జెనరల్ ఎలెక్ట్రిక్ కంపెనీ వారి మోనోగ్రామ్ అనబడే ఆ బిల్ట్–ఇన్ మంచు పెట్టె లో పెట్టిన ఘన పదార్థాలు అన్నీ రాత్రికి రాత్రే ద్రవ ప్రదార్థాలుగా కరిగి పోవడమూ గమనించి, నేను అనాలోచితంగా ఆ పెట్టె తాలూకు అంకెలు చూడగా అటు మంచు గడ్డలు కురిపించే ఎడం పక్క ఫ్రీజర్ భాగమూ, ఇటు పాలూ, పెరుగూ, ముఖ్యంగా సగం తినేసి, మిగతాది ఎవరైనా అతిథులు వస్తే వాటిని వేడి చేసి వాళ్ళకి పెట్టొచ్చులే అని "మిగిలిన పదార్థాలు" దాచుకునే విభాగమూ ..ఇలా అన్ని చోట్లా ఉష్ణోగ్రత బెజవాడ వేసవి స్థాయిలో వంద డిగ్రీల స్థాయిలో ఉంది. అది చూసి నాకు ఆ జి.ఇ. కంపెనీ వారి మీద భలే కోపం వచ్చింది. ఇలాంటి మంచు పెట్టెలో ఏదైనా లోపలి పరికరం పనిచెయ్యక పోవడం మూలాన లోపలి ఉష్ణోగ్రత బయట ఉన్నదానికన్నా పెరిగిపోవడం..అనగా మంచు పెట్టె మైక్రో వేవ్ లా మారిపోయేటప్పుడు అది పొలో మని గావుకేక, అరుపూ, ఈలా, టక టకా ఆగకుండా శబ్దమో ఏదో ఒక విధంగా యజమాని అయిన నన్ను హెచ్చరించవచ్చును కదా! అప్పుడు ఇలా పెరుగు ని మజ్జిగ చేసిన నీలాపనింద నా మీద పడకుండా అప్పుడే వంటింట్లో ఉన్న ఆ అరుస్తున్న ఫ్రిజ్ లో ఉన్న నవ నవ లాడే వంకాయలతో సహా అన్నింటినీ ఇరవై అడుగుల దూరం లో గరాజ్ లో ఉన్న సవతి ఫ్రిజ్ లోనే పెట్టుకుని నా మానం కాపాడుకునే వాడిని కదా!. ఇప్పుడు గత్యంతరం లేక మా ఇంట్లో ఒక్క మా క్వీన్ విక్టోరియా కి తప్ప మిగతావి ఏమైనా పని చెయ్యడం మానేస్తే వచ్చి బాగు చెయ్యడానికి 'నెల నెలా వంద డాలర్లు' స్కీమ్ లో నేను కాంట్రాక్ట్ కుదుర్చుకున్న ఘనత వహించిన సియర్స్ కంపెనీ వారి హోమ్ వారంటీ వారిని పిలిచాను. సియర్స్ వారికి ఈ హోమ్ వారంటీ తాళి కట్టి నాలుగైదు ఏళ్ళు అయినప్పటినుంచీ సహ జీవనం చేస్తూనే ఉన్నాం.

నేను సదరు సియర్స్ వారికి ఫోన్ చెయ్యగానే, ముందు కోవిడ్ గురించి వారు తీసుకుంటున్న జాగ్రత్తలూ, వారికి వచ్చిన కష్టాలూ, "మీరు కేలిఫోర్నియాలో ఉంటే మా కంపెనీ కి ఉన్న ప్రత్యేక నిబంధనలు" అంటూ అరగంట సేపు ఆ కంప్యూటర్ అమ్మాయి చెప్పిన సోది వినవలసి వచ్చింది. ఆ తర్వాత లైన్ లోకి వచ్చిన చైనా అమ్మాయి పీకింగ్ షీకింగ్ కి ఇలా మా ఫ్రిజ్ లో పెట్టిన పెరుగు మజ్జిగ వలె మారిపోయింది అని చెప్పగానే పాపం మూర్ఛపోయిందో ఏమిటో కానీ కాస్సేపు మాట రాలేదు మరి. ఆ తర్వాత అరగంట నేను కష్టపడితే మా ఫ్రిజ్ రిపేరు కొచ్చిందీ అని ఆ నెంబర్ 'ఎస్ ఎస్ 44 32 ఎన్ ఎన్' పిల్లకి చూచాయగా అర్థం అయి, టెక్నీయషన్ ఎపాయింట్ మెంట్ ఏర్పాటు చేసింది. ఆగస్ట్ 15, 2020 నాడు ఆ టెక్నీషియన్ వారు వేంచేసారు. గుమ్మం లోకి రాగానే వాడు వాడో, వాడు కాక వారిజాక్షియో, ఆ ఇద్దరూ కాని మరొకరో తెలియ లేదు...కరోనా ముసుగు మూలాన. కాస్త నోరు జారాక వాడు అని తెలిసింది. ఆ వాడు యాదాలాపంగా ఆ జి.ఇ.వారి మోనోగ్రామ్ ఫ్రిజ్ తలుపు తీయగానే చెయ్యి కాలి, ఠపీమని వెనక్కి అడుగేశాడు. సహజంగానే ఒళ్ళు



మండిపోయి, తన కారులో ఉన్న పరికరాలు అన్నీ లోపలకి పట్టుకొచ్చి, ఆ ఫ్రిజ్ కి శల్య పరీక్ష చేసి, అన్నీ వాడి సెల్ ఫోన్ లా ఉండే పరికరంలో ఏవేవో నొక్కేసి, ఉలుకూ, పలుకూ లేకుండా సామాను సద్దుకుని వెళ్ళిపోయాడు. ఆ సమయంలో మా క్వీన్ విక్టోరియా ఇంట్లో లేకపోవడం వాడి పూర్వజన్మ సుకృతం. నేను ఉండి, నరక యాతన అనుభవించడం ఎప్పుడో నేను చేసిన పాపం!. అదేమి విచిత్రమో, వాడు అలా వెళ్ళాడో, లేదూ నా సెల్ ఫోన్ టింగ్, టింగ్ మంది. అప్పుడే వచ్చిన సియర్స్ వారి సమాచారం. దాని ప్రకారం వారు మా ఫ్రిజ్ రిపేర్ కి కావలసిన ఆరు పార్ట్స్ ఆర్డర్ చేశారుట. అవి వచ్చాక మళ్ళీ వస్తారుట. అంత వరకూ శలవ్. అదిగో, భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన ఆ ఆగస్ట్ 15, 2020 పవిత్ర దినాన్న పని చెయ్యని ఫ్రిజ్ ఉన్న వంటింట్లోనించి, ఇంకా పనిచేస్తున్న సవతి ఫ్రిజ్ ఉన్న గరాజ్ లోకి ప్రారంభం అయింది నా నడక ప్రస్థానం. ఆ రోజు వచ్చిన రిపేరు వాడు పని చేసే కంపెనీ పేరు ఏదో వైఎస్సార్ అండ్ అసోసియేట్స్. అనగా సదరు సియర్స్ వారు కేవలం మేనేజర్లు మాత్రమే. అసలు పని ఆ రోజు అందుబాటులో ఉన్న నిజమైన రిపేరు కంపెనీల వారికి సబ్ కాంట్రాక్ట్ ఇచ్చి తరిస్తారన మాట. వైఎస్సార్ అండ్ అసోసియేట్స్ వారి యూనిఫారం.... అవును అదే..నీలం రంగు. వారి రాక మొదటి అంకం. మా వంశ ప్రతిష్టని ఇనుమడింప చేసిన ఒకానొక



అంశం గురించి ప్రధానంగా ప్రస్తావించాలి. ఎందుకంటే అమెరికాలో ఈ రిఫ్రిజిరేటర్లు రెండు రకాలు. మొదటి రకం ఏమో మామూలుగా అందరి ఇళ్ళలోనూ ఉండేదే. మహా అయితే కొందరు తెల్ల రంగు డబ్బాలా ఉండేదాని బదులు కాస్త దర్జాగా మిల మిలా మెరిసిపోయే స్టెన్ లెస్స్ స్టీల్ ది కొనుక్కుంటారు. కానీ మరీ ఇంకా ఎక్కువ డబ్బూ, దస్కం ఉన్న వాళ్ళూ లేదా మా లాగా అవి లేకపోయినా దర్జా, దర్పం చూపించుకోదల్చిన వాళ్ళ ఇంట్లో బిల్ట్–



ఇన్ రిఫ్రిజిరేటర్లు ఉంటాయి. ఈ మాట వినగానే "అబ్బో" అని గొప్పగా అనిపిస్తుంది కదా. అదన్న మాట దర్జా, దర్పం అంటే. నిజానికి అదేమిటంటే ఇంటి గోడలోనే ఒక పెద్ద కన్నం పెట్టేసి, అందులో రిఫ్రిజిరేటర్ ని దూర్చేసి, ఆ కన్నంలో ఉన్నట్టు కనపడకుండా గోడతో సమానాంతరంగా మసి పూసి మారేడుకాయ చేసేస్తారన మాట. అంటే మనం పరీక్షగా చూస్తేనే కానీ అక్కడ డాలర్ల కట్టలు దాచుకునే 'రహస్య కన్నం" లాంటిది ఏదో ఉంది అని తెలుస్తుంది కానీ అది ఆఫ్టరాల్ ఒక మామూలు మంచు పెట్టేలే అని ఊహించలేమనమాట. ఒక సారి నేను ఒక గొప్పాయన ఇంటికి వెళ్ళి, వంటింటి గోడలో ఖరీదైన డోర్ హేండిల్ లాంటిది కనపడగానే ఎవరైనా అతిధులు ఇంట్లోకి రాగానే వేసుకున్న కోటూ, పెట్టుకున్న టోపీలు పెట్టుకునే చోటు అనుకుని "హారినీ, ఎంత షోగ్గా ఉందో" అనుకుని ఆ వెధవ డోర్ హేండిల్ లాగగానే గుప్పున అతి చల్లటి గాలి తగలడం, నేను అందులో పెట్టబోయిన నా కోటు వెనక్కి లాగేసుకుని తెల్లబోవడం ఒక ఎత్తు అయితే, డాక్టర్ భార్య అయిన ఆ ఇంటావిడ మయ సభలో ఎన్టీఆర్ నో ఎస్వీఆర్ నో చూసి నవ్విన సావిత్రి లాగా పక, పకా నవ్వడం జరిగిపోయాయి. అదీ బిల్ట్-ఇన్ రిఫ్రిజిరేటర్ పవర్!. ఇంతకీ చెప్పొచ్చేదీ, మా వంశ ప్రతిష్టని ఇనుమడించే విషయం ఏమిటంటే, అలా మిల మిలా మెరిసిపోయే జెనరల్ ఎలెక్ట్రిక్ వారి మోనోగ్రామ్ స్టెన్ లెస్స్ స్టీల్ బిల్ట్-ఇన్ రిఫ్రిజిరేటర్ మా వంటింట్లోనూ, అలా తెల్లగా పేలవంగా ఉండే మామూలు మంచు పెట్టెని కార్లు పెట్టుకునే, ఏసీ, గీసీ లేని గరాజ్ లో సవతి రిఫ్రిజిరేటర్ గానూ పెట్టుకున్నాం. ఆనాడు క్వీన్ విక్టోరియా మాట మన్నించుటయే నా కర్తవ్యముగా భావించితిని కానీ గోడలో తన సొంత కలుగులో పకడ్బందీగా దాకుని ఉన్న ఆ బిల్ట్ ఇన్ భాగవతమే ఈనాడు నా కొంప ముంచును అని తెలియక పోతిని. కావాలంటే కలుగులో దాక్కుని ఉండగానే ఆ బిల్ట్ -ఇన్ మంచు పెట్టెకి శల్య పరీక్ష చేస్తున్న అప్పలనాయుడు & సన్స్ వారి నీలం సాంకేతిక నిపుణులదీ, అనివార్య కారణాల వలన నా అంతట నేనే దాన్ని ఈ విశాల ప్రపంచం లోకి బయటకి లాగి, మా వంటింటి మధ్యలో ఎక్కడ చోటు లేకుండా మూడు నెలలు గడపవలసిననప్పటిదీ ఫొటోలు ఇక్కడ పెట్టాను. అలా బయటకి లాగుటకు కారణమైన సియర్స్ వారి తదుపరి తతంగాలు..వచ్చే నూతన సంవత్సర సంచికలో...........

**COMMENTS**